ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



నానక్‌రాంగూడలోని సుమధుర అపార్ట్‌మెంట్స్‌లో ఎమ్మెల్యే గాంధీ, విద్యుత్ అధికారులు, అపార్ట్‌మెంట్‌వాసులు

ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: శేరిలింగంపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడలో సుమధుర అపార్ట్‌మెంట్స్‌లో నెలకొన్న సమస్యలపై అపార్ట్‌మెంట్‌వాసులు, విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమధుర అపార్ట్‌మెంట్స్ వాసులు మాట్లాడుతూ రోజుకి 18 సార్లు కరెంటు పోతోందని, లో ఓల్టేజీ అని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సాధ్యాసాధ్యాలను పరిశీలించి వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ చరణ్, ఏఈ వేణుగోపాల్, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు గణేష్‌ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, సత్యనారాయణ, నరేష్, నారాయణ, గోవింద్, రామిరెడ్డి, సుమధుర అపార్ట్‌మెంట్స్ చైర్మన్ పివిచౌదరి, రామారావు, దేవిరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రదీప్‌కుమార్, ఎంఎస్‌రావు, రాంనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం



జీహెచ్‌యంసీ అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వార్డు కార్యాలయంలో జీహెచ్‌యంసీ అధికారులతో కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. వర్షాకాలం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. విద్యుత్ దీపాలు, డ్రైనేజీ వ్యర్థాలను వెంటనే తొలగించాలని, గుంతల రోడ్లకు మరమ్మతులు, కుంగిన మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని దోమల నివారణకు మందు స్ప్రే చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ కమిషనర్ కృష్ణయ్య, ఎస్‌డబ్ల్యూం మోహన్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మమత, వాటర్ వర్క్స్ డీజీ వెంకటేశ్వరరావు, స్ట్రీట్ లైట్ భద్రన్న, హార్టికల్చర్ డిపార్టుమెంట్ ప్రియాంక, ఎంటమాలజి డిపార్టుమెంట్ ఉషారాణి, ఎస్ఎఫ్ఐ, ఎస్ఆర్‌పీలు, వివిధ కాలనీ అసోసియేషన్ల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదిక

మూసాపేట: బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య, తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 23న జరిగే వివాహ పరిచయ వేదిక ఉంటుందని అధ్యక్షులు వెల్లాల రాంమోహన్ తెలిపారు. 23వ తేదీ ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని, వధూవరుల తల్లిదండ్రులు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ రోడ్డులో మురుగు ప్రవాహం

మియాపూర్: మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ రోడ్డులో, పోలీస్‌స్టేషన్ రోడ్డులో మురుగు నీరు పారుతోంది. గత వారం రోజులుగా మ్యాన్‌హోళ్ల నుండి మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రవహించడంతో ఆ దారి వెంబడి వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ రోడ్డులో..

సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలి

సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్నును చెల్లించి జీహెచ్ఎంసీ అభివృద్ధికి సహకరించాలని ఉప కమిషనర్ రవి కుమార్ కోరారు. ఈ నెల 30వ తేదీ వరకు ఇంటి పన్నులు చెల్లిస్తే ఎలాంటి అపరాధ రుసుం ఉండదన్నారు. సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన బిల్లు కలెక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బిల్ కలెక్టర్‌కు టార్గెట్ విధించామని, దానిని తప్పనిసరిగా రీచ్ అవ్వాలని సూచించారు. జూన్ నెలకు రూ.4 కోట్లు వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకనుగుణంగా వసూళ్లను పెంచాలన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా నేరుగా తన దృష్టికి తేవాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్కిల్ కార్యాలయానికి రూ.64 కోట్ల టార్గెట్ విధించారని, ప్రస్తుతం రూ.23 కోట్ల ఆస్తి పన్ను మాత్రమే వసూలైందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సమావేశంలో బిల్లు కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు దశల్లో పాలిసెట్- 24 అడ్మిషన్లు

- 2 కోర్సులు.. ఒక్కోదానిలో 60 సీట్లు
- జూలై 18 నుంచి తరగతులు ప్రారంభం
- అందుబాటులో హాస్టల్.. ఆధునిక సౌకర్యాలు.. ల్యాబ్‌లు
- జీఐఎల్‌టీ రాయదుర్గం ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్

'జీఐఎల్‌టీ'లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో 2024–25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియపై మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ పలు అంశాలను వివరించారు. పాలిసెట్–2024లో అర్హత సాధించిన విద్యార్థులకు రెండు ఫేజ్‌లలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించాలని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్ణయించిందని, అందుకోసం ప్రత్యేక షెడ్యూల్‌ను ప్రకటించిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ఇతర పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్లకు వర్తించే ప్రక్రియ రాయదుర్గం జీఐఎల్‌టీకి వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

– రాయదుర్గం

ప్రశ్న: అడ్మిషన్ల షెడ్యూల్ గురించి?

ప్రిన్సిపల్: ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ ఈనెల 20 నుంచి 24 వరకు ఉంటుంది. సర్టిఫికెట్ల పరిశీలన 22 నుంచి 25 వరకు ఉంటుంది. సీట్ల కేటాయింపు 30వ తేదీ వరకు చేస్తారు. ఫీజు చెల్లించడానికి కూడా 30 నుంచి జూలై 4 వరకు అవకాశం .జులై 13 నుంచి 16 వరకు కాలేజ్‌లో రిపోర్టు చేయవచ్చు. జూలై 18 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ప్ర: జీఐఎల్‌టీలోని కోర్సుల వివరాలు, ఎన్ని సీట్లు ఉన్నాయి..?

జ: జీఐఎల్‌టీలో రెండు కోర్సులు ఉన్నాయి. ఒకటి డిప్లొమో ఇన్ లెదర్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, రెండవది డిప్లొమో ఇన్ లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. ఒక్కో కోర్సులో 60 చొప్పున రెండింటిలో కలిసి 120 సీట్లు ఉన్నాయి.

ప్ర: జీఐఎల్‌టీలో కల్పించిన సౌకర్యాలు, ల్యాబ్‌ల వివరాల గురించి..



జ: జీఐఎల్‌టీలో అత్యాధునిక తరహా సౌకర్యాలు, ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి, ముఖ్యంగా విద్యార్థులకు ప్రోటోటైప్ క్యానరీ ల్యాబ్, టెస్టింగ్ అండ్ క్వాలిటీ ఇన్‌స్పెక్షన్ ల్యాబ్, కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, ఈ బుక్స్, ఈ క్లాస్‌రూమ్, ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్, మెడర్న్ ల్యాబ్, మెషినరీ, ఫుట్‌వేర్ ఫ్యాషన్ స్టూడియో వంటివి అందుబాటులో ఉంటాయి.వసతి గృహం అందుబాటులో ఉంది, దీనికితోడు స్కాలర్‌షిప్, బస్‌పాస్ వంటివి కూడా ఉంటాయి. ముఖ్యంగా ఫీజు రియంబర్స్‌మెంట్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది.

ప్ర: ప్లేస్‌మెంట్స్ ఎలా ఉన్నాయి..

జ: జీఐఎల్‌టీలో 100 శాతం ప్లేస్‌మెంట్‌లు ఉన్నాయి. థియరీ, ప్రాక్టికల్ సెమిస్టర్లు పూర్తి చేశాక, కంపెనీలలో పనిచేసేలా ఒక సెమిస్టర్ ఉంటుంది. ఆతర్వాత కోర్సు పూర్తయ్యాక ఇప్పటి వరకు 100 శాతం ప్లేస్‌మెంట్లు లభించాయి. ముఖ్యంగా జాతీయ, అంతర్జాతీయ లెదర్ టెక్నాలజీ కంపెనీలలో అవకాశాలు వచ్చాయి. కొందరు ఇప్పటికే విదేశాలలో పనిచేస్తుండగా.. మరికొందరు సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసుకుని నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు.

సీఆర్ ఫౌండేషన్‌లో శిక్షణా కేంద్రం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పొకెన్ ఇంగ్లిష్, ట్యాలీ, డీటీపీ శిక్షణ ఉచితంగా ఇస్తున్నారు. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒక్కో బ్యాచ్‌కు 3 నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మహిళలు, చిన్నారులు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ జోస్యభట్ల కల్పన ఫోన్ : 9603193925 కు సంప్రదించవచ్చు.

అవగాహన ర్యాలీ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో కాలుష్యంతో ఎదురవుతున్న సమస్యలు, కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రముఖ న్యాయవాది, పర్యావరణ వేత్త దండె రమాకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కాలుష్యం వెలువడుతున్న తీరుపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ కాలుష్యం విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నామన్నారు. కాలుష్యాన్ని నివారించటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు తవ్వి వదిలేశారు.. గుంతలు పడ్డాయ్



మియాపూర్: మియాపూర్‌లోని కృషినగర్ కాలనీ ప్రధాన రహదారిని తవ్వి వరదనీటి పైపులైన్ పనులు చేపట్టి రోడ్డు బాగు చేయకుండా వదిలేయడంతో ఆ రోడ్డు గుంతలమయంగా మారింది. వరదనీటి పైపులైన్ పనులు పూర్తై సుమారు 2 నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయడం లేదని ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డును తవ్విన ప్రాంతంలో మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదకరం

మూసాపేట: ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదం అని, ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణం చేయకూడదని డిప్యూటీ రీజినల్ మేనేజర్ కవిత అన్నారు. మంగళవారం కూకట్‌పల్లిలో ఆయా బస్టాప్‌ల వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక టీమ్‌లు ఆయా బస్టాండ్‌లలో ఉండి జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. బస్‌లు బస్‌బేలోకి వచ్చే విధంగా చూడటం, ప్రయాణికులు బస్ ఆగిన తరువాత బస్ ఎక్కటం, దిగటం చేయాలని సూచిస్తూ, ఆ సమయంలో డ్రైవర్, కండక్టర్‌ల ప్రవర్తనను పర్యవేక్షిస్తారని అన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయ్యాయని విద్యార్థులు పరుగెత్తుకుంటూ వెళ్లి బస్ ఎక్కవద్దని సూచించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఆర్‌టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ ఇషాక్, సిబ్బంది పాల్గొన్నారు.



కూకట్‌పల్లి బస్టాప్ వద్ద ప్రత్యేక డ్రైవ్‌లో ఆర్టీసీ అధికారులు

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయండి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): నిర్దేశించిన గడువులోపు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవనాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే రెండు నెలల్లోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అధికారులు అభివృద్ధి పనులు జరిగే సమయంలో క్షేత్రస్థాయిలో ఉండి పనులను వేగవంతంగా చేయాలని సూచించారు. అంబేద్కర్ కమ్యూనిటీహాల్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, నగేష్, మండల విద్యాధికారి రాథోడ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్ పాల్గొన్నారు.

24 గంటలు వైద్యం అందించే ఆసుపత్రులు

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో..

మెడికేర్ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్	88852 62138
శ్రీకర హాస్పిటల్ :	04047470000
ప్రణామ్ ఆస్పత్రి :	040 2304 2777
హీలెక్స్ ఆసుపత్రి :	040 42007070
లక్ష్మి చిల్డ్రన్ ఆసుపత్రి :	040 2303 9733
అంకుర చిల్డ్రన్ ఆసుపత్రి :	040 4939 9999
ఉద్భవ ఆసుపత్రి :	040 6782 0172
సిదార్థ ఆసుపత్రి :	79933 33301
పల్స్ సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి :	040 29334142

ఘనంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, బీఆర్ఎస్ నాయకులు

రాయదుర్గం: మధురానగర్‌లో రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెద్దగోని రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, బీఆర్ఎస్ నాయకులు సాయిబాబా,గణేష్, శ్రీనివాస్‌యాదవ్‌లను ఘనంగా సత్కరించారు. దారుగుపల్లి నరేష్, నారాయణ, గోవింద్, స్థానికులు పాల్గొన్నారు.

జ్యూస్‌లు పంపిణీ



శేరిలింగంపల్లి: నిర్జల ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం నల్లగండ్లలోని అపర్ణ సైబర్ లైఫ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచినీరు, జ్యూస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి పండిత మాట్లాడుతూ నిర్జల ఏకాదశి సందర్భంగా ఉపవాస దీక్షలు పాటిస్తారని పానీయాల పంపిణీతో ఆశీర్వాదాలు, ఆధ్యాత్మిక యోగ్యత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు బేబి, ప్రదీప్ ఆనంద్‌శర్మ, రాకేష్ జిందాల్, మీనా విజయ్, సుశీల అగర్వాల్, బషీరుద్దీన్, అర్చన, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఘనాపూర్ గ్రామంలో గల శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో మంగళవారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మ తల్లి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని మంజీరా క్యాంపస్‌లోని స్వయంభు పెద్దమ్మ తల్లి దేవస్థానం ఏడవ వార్షికోత్సవం నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, హోమాలు చేశారు.

బీజేపీ నాయకుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సామా రంగారెడ్డి

గచ్చిబౌలి: మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మసీద్‌బండలో బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కన్వీనర్ రాఘవేంద్రరావు, ఇంచార్జీ ఎం.రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రధాన నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు హైదరాబాద్‌కు వస్తున్నారని వారికి ఘన స్వాగతం పలకాలన్నారు. డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు సూచించారు. పార్టీ సీనియర్ నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మణిభూషణ్, రామరాజు, నవతారెడ్డి, వెలగ శ్రీనివాస్, శ్రీధర్, ఆంజనేయులు, నవీన్‌గౌడ్, కృష్ణ ముదిరాజ్, రాజుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శేరిలింగంపల్లి: పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో కాళ్లు, చేతులు విరిగిపోయి మృతి చెందిన సంఘటన లింగంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ భాగ్యరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం తెల్లవారుజామున లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో పట్టాలు దాటుతున్న వ్యక్తి (40)ని రైలు ఢీకొనడంతో తలకు బలమైన గాయమై మృతి చెందాడన్నారు. మృతుడు 4.6 అడుగుల ఎత్తు, బ్లూ కలర్ ప్యాంట్, ఎరుపు,తెలుపు గీతల షర్ట్ ధరించినట్లు తెలిపారు. నాంపల్లి జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ మోడల్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్‌లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తెలంగాణ ప్రభుత్వ మోడల్ కళాశాలలో ఈనెల 22వ తేదీన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రాంప్రసాద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన ఉదయం10.30 గంటలకు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్‌లు తీసుకుంటున్నామన్నారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు ఒరిజినల్ టీసీ, 10వ తరగతి హాల్ టిక్కెట్ కాపీలు, 10వతరగతి ఫలితాల షీట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం సమర్పించిన వెంటనే అడ్మిషన్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. పత్రాల సమర్పణకు గ్రేస్ సమయం ఉండదని తెలిపారు.

డంపింగ్ యార్డు తలపించేలా..!



న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద పేరుకుపోయిన చెత్త చెదారం

- న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద గుట్టలుగా పేరుకుపోయిన చెత్త
- దుర్వాసన వెదజల్లుతున్న పరిసరాలు
- బస్తీవాసుల అవస్థలు

హఫీజ్‌పేట్: న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ ప్రాంతం డంపింగ్ యార్డును తలపిస్తోంది. న్యూహఫీజ్‌పేట్ ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ బస్తీల మధ్య ఉన్న జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. పరిసరాలు దుర్గంధ పూరితంగా తయారయ్యాయి. సమీప ప్రాంతాల వాసులు చెత్తను ద్విచక్ర వాహనాలపై తీసుకువచ్చి ఫ్లైఓవర్ కింద వేస్తున్నారు. దీంతో చెత్త పేరుకుపోతోంది. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది బస్తీలలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. ఫ్లైఓవర్ కింద, హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ ఆనుకుని రాత్రి సమయాలలో అసాంఘటిత కార్యక్రమాలు జరుగుతున్నాయని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. వాటిపై పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యలు ఇవే..

- స్థానికులు చెత్త చెదారం చెత్త ఆటోలలో వేయకుండా రోడ్లపైనే పోస్తున్నారు.
- పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేయకపోవడంతో గుట్టలుగా చెత్త పేరుకుపోతుంది.
- చెత్త చెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తింటున్నాయి.
- ఇక కొంతమంది చెత్తను మురుగు కాలువలో వేయడం వలన నీటి ప్రవాహం సాగక మురుగు నిలిచిపోతోంది
- నాలాలో పేరుకుపోయిన చెత్తతో మురుగునీరు రోడ్లపైకి ,ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.
- న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద చెత్త చెదారం వేయకుండా చర్యలు తీసుకోవడంతో బాటు, కాలువలో చెత్త వేయకుండా నాలాకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి
- చెత్త వేసే చోట శుభ్రం చేసి మొక్కలు నాటి బస్తీ వాసులకు అవగాహన కల్పించాలి
- రోడ్లపై చెత్త వేసే వారికి జరిమానా విధించాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్వాసనతో సతమతం



న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద పేరుకుపోయిన చెత్తతో అనారోగ్యం పాలవుతున్నాం. దానికి తోడు పక్కనే ఉన్న మురుగు నీటి కాలువలో కూడా ఇదే పరిస్థితి. దుర్వాసన తట్టుకోలేకపోతున్నాం. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గౌస్, ఆదిత్యనగర్

గంజాయి తాగుతున్నారు



హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ బస్తీల వద్ద రాత్రి సమయాలలో కొంత మంది యువకులు గంజాయి తాగుతున్నారు. పోలీసులు నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలి.

– సయ్యద్, ఆదిత్యనగర్







ఆదిత్యనగర్ బస్తీ నుంచి వెళ్ళే నాలా పక్కన చెత్త చెదారం

నర్సాపూర్-పటాన్‌చెరు బస్సు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): నర్సాపూర్ నుంచి జిన్నారం మీదుగా పటాన్‌చెరు వరకు ఆర్టీసీ బస్సును మంగళవారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ సేవలను అందిస్తుందన్నారు .మండల కేంద్రమైన జిన్నారానికి మరిన్ని బస్సులను పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

రాజేంద్రనగర్: బక్రీద్ సందర్భంగా పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ మంగళవారం కొనసాగింది. బుధవారం సాయంత్రం వరకు ఈ డ్రైవ్‌ను కొనసాగించాలని ఉప కమిషనర్ రవి కుమార్ అధికారులకు ఆదేశించారు. అధికారులు కార్యాలయంలోనే అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని సూచించారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా నరేందర్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలకు చెందిన వై.నరేందర్ రెడ్డిని బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ మంగళవారం జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామగ్రామాన బీజేపీ శక్తివంతంగా తయారైందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కార్యదర్శిగా నియమితులైన నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి రావడానికి కారకులైన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ శంషాబాద్ రాజు, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.